
సాక్షి
అన్నమయ్య జిల్లా
మంగళవారం । 9 । జూలై । 2024



సిద్దవటం రేంజ్‌లో కూంబింగ్
సిద్దవటం రేంజ్‌లో మూడు రోజులుగా కూంబింగ్ నిర్వహిస్తున్నామని రేంజర్ బి.కళావతి తెలిపారు. మొత్తం 40 మంది ఈ కూంబింగ్‌లో పాల్గొంటున్నారన్నారు. - 8లో



లిల్లీపూల సాగు.. ఆదాయం బాగు
లిల్లీ పూల సాగుతో రైతులు మంచి ఆదాయం గడిస్తున్నారు. నిలకడైన ధరతో లాభాలు వస్తుండటంతో సాగుపై ఆసక్తి చూపుతున్నారు. - 8లో

మదనపల్లి : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.440	రూ.530
రెండోరకం	రూ.320	రూ.420



మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 1530 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	420	450
సీబీ	-	-



మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 102.560కిలోలు

న్యూస్‌రీల్

రాష్ట్ర రవాణా శాఖ మంత్రిని కలిసిన కలెక్టర్

రాయచోటి (జగదాంబ సెంటర్) : రాష్ట్ర రవాణా, యువజన, క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డిని అన్నమయ్య జిల్లా నూతన కలెక్టర్ శ్రీధర్ చామకూరి సోమవారం రాయచోటి పట్టణంలోని మంత్రి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ జిల్లాలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు వేగవంతం చేసి అన్నమయ్య జిల్లా రూపురేఖలు మార్చాలన్నారు. ఇందు కోసం అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రతి ఒక్కరూ సమన్వయంతో పనిచేయాలన్నారు.

ఇంగ్లీష్ గెస్ట్ ఫ్యాకల్టీకి దరఖాస్తు చేసుకోండి

వాల్మీకిపురం : స్థానిక ఏపీ మైనార్టీ బాలికల గురుకుల జూనియర్ కళాశాల ఆవరణంలో ఖాళీగా ఉన్న ఇంగ్లీష్ సబ్జెక్టు గెస్ట్ ఫ్యాకల్టీ పోస్టుకు అర్హులైన మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ రమామంజుల ఓ ప్రకటనలో తెలిపారు. అర్హులైన మహిళా అభ్యర్థులు ఎంఏ ఇంగ్లీష్ పూర్తి చేసిన వారై ఉండాలన్నారు. ఈనెల 13వ తేదీ లోగా అభ్యర్థులు నేరుగా కళాశాలకు వచ్చి దరఖాస్తులు అందజేయాలని సూచించారు.

నేడు జెడ్పీ సమావేశం

కడప సెవెన్‌రోడ్స్ : జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం మంగళవారం ఉదయం 9.45 గంటలకు జెడ్పీ సమావేశ మందిరంలో జరగనుందని సీఈఓ సుధాకర్‌రెడ్డి తెలిపారు. ఉమ్మడి జిల్లా జెడ్పీటీసీ సభ్యులతోపాటు ప్రజాప్రతినిధులు, కలెక్టర్ శివశంకర్, ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొంటారని తెలిపారు. అధికారులు తమ నివేదికలతో హాజరు కావాలని సూచించారు.

కడప ఇన్‌చార్జి ఆర్డీఓగా వెంకటపతి

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప రెవెన్యూ డివిజనల్ ఇన్‌చార్జి ఆఫీసర్‌గా వి.వెంకటపతిని నియమించారు. ఈయన సోమవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి ఆదేశాల మేరకు ఆయన నేషనల్ హైవే స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా పనిచేస్తూ ఇన్‌చార్జి ఆర్డీఓగా నియమితులయ్యారు. ఈ మేరకు బాధ్యతలు చేపట్టారు. ఇదిలా ఉండగా ఇప్పటివరకు ఆర్డీఓగా పనిచేస్తున్న మధుసూదన్ వ్యక్తిగత కారణాలతో సెలవుపై వెళ్లడంతో ఇన్‌ఛార్జి ఆర్డీఓను కలెక్టర్ నియమించారు.

పాఠశాల విద్య ఆర్‌జేడీ రాఘవరెడ్డి బదిలీ

- ప్రభుత్వానికి రిపోర్టు చేయాలని ఆదేశం
- ఎఫ్ఏసీ ఆర్‌జేడీగా శామ్యూల్

కడప ఎడ్యుకేషన్ : పాఠశాల విద్య ఆర్‌జేడీగా పని చేస్తున్న ఎద్దుల రా ఘవరెడ్డిని సోమవారం రాష్ట్ర ప్రభుత్వం బదిలీ చేసింది. ప్రభుత్వానికి రిపోర్టు చేయాల్సిందిగా ఆదేశాలను జారీ చేసింది. గత కొన్ని రోజులుగా అయనపై పలు రకాల ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం విచారణకు ఆదేశించింది. ఈనెల 8, 9 తేదీల్లో విచారణ జరగాల్సి ఉండగా అనివార్య కారణలతో విచారణ వాయిదా పడింది. ఈ నేపథ్యంలో ఆయనపై క్రమశిక్షణా చర్యలు పెండింగ్‌లో ఉన్నందున తక్షణమే బదిలీ చేస్తూ ఉత్వర్వులు జారీ చేసింది. తదుపరి ఉత్తర్వులు వెలువడే వరకు పాఠశాల విద్య ఆర్‌జేడీగా కర్నూలు విద్యాశాఖ అధికారి కాగిత శామ్యూల్‌కు పూర్తి అదనపు బాధ్యతలను అప్పగించింది. ఈయన రెండు మూడు రోజుల్లో ఆర్‌జేడీ(ఎఫ్ఏసీ)గా బాధ్యతలు చేపట్టనున్నారు.

పుట్టగొడుగుల పెంపకంపై 10, 11 తేదీల్లో శిక్షణ

కడప అగ్రికల్చర్ : కడప నగర శివార్లలోని ఊటుకూరు కృషి విజ్ఞాన కేంద్రంలో పుట్టగొడుగుల పెంపకంపై ఈనెల 10, 11 తేదీలలో శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కేవీకే ప్రోగ్రాం కో ఆర్డినేటర్ డాక్టర్ వీరయ్య తెలిపారు. ఆసక్తి గల వారు ఈ తేదీలలో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల లోపు 9848809236 నంబర్‌కు ఫోన్ చేసి పేరు నమోదు చేసుకోవాలని సూచించారు.

ట్రాన్స్‌కో ఎస్ఈగా శ్రీనివాసరావు

కడప కార్పొరేషన్ : ఏపీ ట్రాన్స్‌కో సూపరింటెండెంట్ ఇంజినీరుగా కుంభా శ్రీనివాసరావు నియమితులయ్యారు. ఈ మేరకు సోమవారం శంకరాపురంలోని ట్రాన్స్‌కో నిలయంలో ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 4 జిల్లాలలోని పెండింగ్ ప్రాజెక్టులను త్వరగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే అంతరాయాలు లేకుండా లైన్లు, సబ్‌స్టేషన్లు నిర్వహించాలన్నారు. అనంతరం విద్యుత్ ఉద్యోగులు సిబ్బంది ఆయనను ఘనంగా సన్మానించి స్వాగతం పలికారు. ఎస్ఈ క్రిష్ణకుమార్, విద్యుత్ బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జీకే వీరభద్రయ్య, ఈఈలు శ్రీరామచంద్రమూర్తి, రమణమూర్తి, సుబ్రమణ్యం, నగేష్, డీఈలు రాంమోహన్, రామాంజనేయులు, విద్యావతి పాల్గొన్నారు.

కార్యకర్తల్లో ధైర్యం నింపి..
ప్రజలకు భరోసా ఇచ్చి..

- ముగిసిన మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జిల్లా పర్యటన
- మూడు రోజుల పాటు ప్రజలు, నాయకులు, కార్యకర్తలతో మమేకం
- మళ్లీ మంచి రోజులు వస్తాయని ఆత్మవిశ్వాసం నింపిన వైఎస్ జగన్
- దివంగత సీఎం వైఎస్సార్‌కు నివాళి అనంతరం తాడేపల్లికి పయనం



వైఎస్సార్ జయంతి సందర్భంగా ఇడుపులపాయలో వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నేతలు



వైఎస్ జగన్‌కు నాగలి బహూకరిస్తున్న కడప మేయర్ సురేష్‌బాబు, సంబటూరు ప్రసాద్‌రెడ్డి

సాక్షిప్రతినిధి కడప : వైఎస్సార్‌సీపీ అధినేత, రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మూడు రోజుల జిల్లా పర్యటన సోమవారం విజయవంతంగా ముగిసింది. ఈనెల 6వ తేదీన జిల్లాలో అడుగిడిన వైఎస్ జగన్ కడప, పులివెందుల ప్రాంతాల్లో పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. తొలిరోజు టీడీపీ నాయకుల దాడిలో గాయపడి కడప రిమ్స్‌లో చికిత్స పొందుతున్న వేంపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త అజయ్‌కుమార్‌రెడ్డిని పరామర్శించారు. అనంతరం పులివెందులకు చేరుకుని ప్రజాదర్బార్ నిర్వహించారు. శని, ఆదివారాల్లో ప్రజలు భారీగా తరలివచ్చి తమ సమస్యలను అభిమాన నేతకు విన్నవించుకున్నారు. ప్రతి ఒక్కరి వినతిని ఓపిగ్గా పరిశీలించి సంబంధిత సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టారు. అలాగే పలు జిల్లాల నుంచి వచ్చిన పార్టీ నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులతో తాజా రాజకీయ పరిస్థితులపై చర్చించి వారికి దిశా నిర్దేశం చేశారు. మూడు రోజుల పర్యటనలోనూ మాజీ సీఎం పట్ల ప్రజలు తమ అభిమానాన్ని చాటుకున్నారు. పలు గ్రామాల్లో వైఎస్ జగన్‌ను చూడాలని, ఆయనతో తమ మనసులోని బాధను పంచుకోవాలని గంటల తరబడి వేచి చూశారు. వైఎస్ జగన్‌ను చూడగానే పలువురు భావోద్వేగానికి గురయ్యారు. ప్రతి ఒక్కరినీ ఆయన ఓదారుస్తూ కష్టాలు తాత్కాలికమేనని.. మళ్లీ మంచి రోజులు వస్తాయని అంతవరకూ అందరూ ధైర్యంగా ఉండాలని చెప్పారు. కష్టకాలంలో పార్టీ కార్యకర్తలకు అండగా నిలవాలని నాయకులకు సూచించారు. చివరి రోజు సోమవారం ఇడుపులపాయలో వైఎస్సార్ ఘాట్ వద్ద దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి వేడుకల్లో పాల్గొన్నారు. వైఎస్సార్‌కు ఘనంగా నివాళులర్పించి రాష్ట్రానికి ఆయన చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. అనంతరం ఆయన ఇడుపులపాయ నుంచి కడప విమానాశ్రయానికి చేరుకుని తాడేపల్లికి బయలుదేరి వెళ్లారు.

వైఎస్ జగన్‌కు ఆత్మీయ వీడ్కోలు

కడప కార్పొరేషన్ : మూడు రోజుల జిల్లా పర్యటన ముగించుకొని తాడేపల్లి వెళ్తున్న మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కడప విమానాశ్రయంలో ఆత్మీయ వీడ్కోలు లభించింది. కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి, ఎమ్మెల్సీ రమేష్ యాదవ్, కడప మేయర్ కె. సురేష్ బాబు, ఉద్యాన శాఖ మాజీ సలహాదారు సంబటూరు ప్రసాద్‌రెడ్డి, పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆయనకు ఘనంగా వీడ్కోలు పలికారు.



వైఎస్ జగన్‌కు అభివాదం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి



పార్టీ నాయకులతో సరదాగా మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి



వైఎస్ జగన్‌ను చూసిన ఆనందంలో అభిమానుల అభివాదం

ప్రభుత్వ భూముల ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలి

- కలెక్టర్‌కు లెటర్ ప్యాడ్‌పైన ఆదేశించిన మంత్రి మండిపల్లి

రాయచోటి : జిల్లాలో ప్రభుత్వ భూములు ఆక్రమించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర రవాణా, యువజన క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి జిల్లా కలెక్టర్‌ను ఆదేశించారు. ఈ మేరకు సోమవారం మంత్రి లెటర్ ప్యాడ్‌పైన ప్రభుత్వ భూముల ఆక్రమణపై విచారించి సత్వరం చర్యలు తీసుకోవాలని చెప్పారు. జిల్లా వ్యాప్తంగా గత ఐదు సంవత్సరాలలో ఎన్నో భూ ఆక్రమణలు జరిగాయని, ప్రభుత్వ భూములు ఆక్రమించిన వారు ఎంతటి వారైనా సహించేది లేదని హెచ్చరించారు. జిల్లాలో ఎక్కడెక్కడ ప్రభుత్వ భూములు ఉన్నాయి, వాటి వివరాలు సేకరించి స్వాధీనం చేసుకోవాలన్నారు. రాయచోటి నియోజకవర్గ పరిధిలో 2 వేల ఎకరాల ప్రభుత్వ భూములను వైఎస్సార్‌సీపీ నాయకులు ఆక్రమించి కంచెలు వేసుకున్నారని, వాటిపై కూడా విచారణ చేసి చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.

యువజన క్రీడా శాఖ మంత్రిని కలిసిన ఒలంపిక్ చాంపియన్



మంత్రి రాంప్రసాద్‌రెడ్డిని కలిసిన ఆసియా ఒలంపిక్ చాంపియన్ శ్రీలక్ష్మి

రాయచోటి రూరల్ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రవాణా యువజన క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డిని ఆసియా ఒలంపిక్ చాంపియన్ శ్రీలక్ష్మి మర్యాదపూర్వకంగా కలిశారు. తను సాధించిన మెడల్స్ గురించి వివరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు అధిక ప్రాధాన్యతనిస్తోందన్నారు. క్రీడాకారులు క్రీడా పోటీలలో పాల్గొని విజయాలు సాధించి మన రాష్ట్రానికి, దేశానికి మంచిపేరు తీసుకురావాలన్నారు.

పరిశ్రమల ఏర్పాటుకు చర్యలు

జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి

రాయచోటి : అన్నమయ్య జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు త్వరితగతిన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్ జిల్లా పరిశ్రమల శాఖ అధికారులను, ఆర్డీఓలను ఆదేశించారు. సోమవారం మధ్యాహ్నం రాయచోటి కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో జిల్లాలో ఏర్పాటు చేయబోయే వివిధ పరిశ్రమల గురించి, వాటికి సంబంధించిన భూమి సేకరణపై రాయచోటి, మదనపల్లి ఆర్డీఓలు, జిల్లా పరిశ్రమల శాఖ అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా పరిశ్రమల శాఖ అధికారి సూరిబాబు మాట్లాడుతూ అన్నమయ్య జిల్లాలో శిబ్యాల మండలంలో దాదాపు 300 ఎకరాలలో పారిశ్రామిక పార్కు ఏర్పాటుకు సంబంధించిన నివేదికను సిద్ధం చేశామన్నారు. మదనపల్లికి దగ్గరలో ప్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్‌కు సంబంధించిన నివేదికను తయారు చేశామని జిల్లా కలెక్టర్‌కు వివరించారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పరిశ్రమల ఏర్పాటు చాలా కీలకమని, ఆర్థిక అభివృద్ధి జరగాలంటే పరిశ్రమలు ఎక్కువగా ఉండాలన్నారు. జిల్లాలో ఏర్పాటు చేయబోయే పారిశ్రామిక పార్కులకు, ఎంఎస్ఎంఈ పార్కులకు సంబంధించిన నివేదికలను త్వరగా సిద్ధం చేయాలని సూచించారు. వీటికి సంబంధించి భూమి సేకరణలో ఇంకా ఏవైనా పనులు మిగిలి ఉంటే వాటిని త్వరగా పూర్తి చేయాలన్నారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి సత్యనారాయణరావు, మదనపల్లి, రాయచోటి ఆర్డీఓలు, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ శ్రీనివాసమూర్తి తదితరులు పాల్గొన్నారు.



ప్రజల నుంచి అర్జీలను స్వీకరించి వాటి పరిష్కారంపై చర్చిస్తున్న జిల్లా కలెక్టర్ శ్రీధర్

ప్రజలకు చేరువగా స్టాప్ డయేరియా కార్యక్రమం

స్టాప్ డయేరియా కార్యక్రమం ప్రజలందరికీ చేరువయ్యేలా చర్యలు తీసుకొని జిల్లాలో అతిసార వ్యాధి లేకుండా చూడాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులను జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్ ఆదేశించారు. సోమవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో జిల్లా కలెక్టర్ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులతో స్టాప్ డయేరియా కార్యక్రమంపై సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. అనంతరం ఈ నెల 11న ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా »తల్లి మరియు బిడ్డ శ్రేయస్సు కోసం సరైన సమయంలో గర్భధారణ మరియు బిడ్డకు బిడ్డకు మధ్య అంతరం« అనే థీమ్‌తో ఒక పోస్టర్‌ను జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు. సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి కొండయ్య, ఆ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

అర్జీదారులు సంతృప్తి చెందేలా పరిష్కారం చూపాలి

ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా అర్జీదారులు సంతృప్తి చెందేలా సమస్యలకు పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్ అధికారులను ఆదేశించారు. సోమవారం రాయచోటి కలెక్టరేట్‌లోని సమావేశ హాలులో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెసెల్ సిస్టం- పీజీఆర్ఎస్) కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని పటిష్టంగా నిర్వహించాలన్నారు. అందిన అర్జీలను ప్రాధాన్యతగా తీసుకుని బాధ్యతాయుతంగా వందశాతం పరిష్కరించాలన్నారు. వచ్చిన అర్జీలను అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి సమస్యపై అవగాహన కలిగించుకొని దానిని పరిష్కరించేందుకు క్షేత్రస్థాయిలో పారదర్శకంగా విచారణ చేయాలన్నారు. అనంతరం వివిధ సమస్యలతో వచ్చిన ప్రజల నుంచి కలెక్టర్‌తోపాటు జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, డీఆర్ఓ సత్యనారాయణరావు, ఎస్‌డీసీ రామసుబ్బయ్యలు ఫిర్యాదులను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

చట్ట పరిధిలో సమస్యలను పరిష్కరించండి

- ఎస్పీ కృష్ణారావు



ఫిర్యాదులు స్వీకరించి వారి సమస్యను నేరుగా అడిగి తెలుసుకుంటున్న జిల్లా ఎస్పీ కృష్ణారావు

రాయచోటి : ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రివెన్ రెడ్రెసల్ సిస్టం) కార్యక్రమం ద్వారా వచ్చిన ఫిర్యాదులకు చట్ట పరిధిలో సత్వరం పరిష్కారం చూపాలని ఎస్పీ బి.కృష్ణారావు సంబంధిత పోలీస్ అధికారులను ఆదేశించారు. సోమవారం అన్నమయ్య జిల్లా రాయచోటి పోలీస్ కార్యాలయంలో ఎస్పీ నేరుగా ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. జిల్లా నలుమూలల నుంచి అనేక సమస్యలతో వచ్చిన 53 మంది ఎస్పీని కలిసి సమస్యలను విన్నవించుకున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ కింది స్థాయి పోలీసు అధికారులతో మాట్లాడుతూ ఫిర్యాదులను చట్టపరిధిలో విచారించి త్వరితగతిన పరిష్కారం చూపాలన్నారు. ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించి వారితో ముఖాముఖి మాట్లాడి ఫిర్యాదుదారుల సమస్యలను తెలుసుకొని పూర్తిస్థాయిలో పరిష్కరిస్తామని భరోసా కల్పించారు.

రాజన్న సేవలు చిరస్మరణీయం



రాయచోటి : వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు



మదనపల్లె : వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నియోజకవర్గ సమన్వయకర్త నిసార్‌అహ్మద్, మున్సిపల్ చైర్మన్ మనూజారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ నరేష్‌కుమార్‌రెడ్డి



రైల్వేకోడూరు : వైఎస్సార్ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు

రాయచోటి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రిగా డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి అందించిన సేవలు చిరస్మరణీయమని పలువురు నాయకులు పేర్కొన్నారు. డాక్టర్ వైఎస్ఆర్ 75వ జయంతిని సోమవారం జిల్లాలో ఘనంగా నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో ఆయన విగ్రహాలు, చిత్రపటాలకు ఘనంగా నివాళులర్పించారు. పలు చోట్ల సేవా కార్యక్రమాలు నిర్వహించారు. రాష్ట్రానికి వైఎస్సార్ చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. వైఎస్సార్ జిల్లా ఇడుపులపాయలోని వైఎస్సార్ ఘాట్ వద్ద మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఆయన తల్లి వైఎస్ విజయమ్మ, సతీమణి వైఎస్ భారతిరెడ్డితో పాటు పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

- రైల్వేకోడూరులోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో అలాగే టోల్‌గేట్ వద్ద వైఎస్సార్ చిత్రపటం, విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ఆరోగ్యశ్రీ, ఇందిరమ్మ ఇళ్లు, ఫీజు రీఎంబర్స్‌మెంట్‌తోపాటు రైతులకు అనేక పథకాలు ప్రవేశపెట్టి ప్రజల హృదయాల్లో చిరస్మరణీయంగా నిలిచిపోయారని కొనియాడారు.
- మదనపల్లె మండలం తట్టివారిపల్లెలో వైఎస్సార్ విగ్రహానికి వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త నిసార్ అహ్మద్, మాజీ ఎమ్మెల్సీ బి.నరేష్‌కుమార్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ మనూజారెడ్డి, వైస్‌చైర్మన్ జింకాచలపతి, పార్టీ నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వ్యవసాయానికి ఉచిత విద్యుత్, 108, ఆరోగ్య శ్రీ, ఫీజు రీయింబర్స్‌మెంట్, పొదుపుసంఘాల మహిళలకు పావలావడ్డీ రుణాలు, అర్హులందరికీ ఇళ్లు తదితర అనేక సంక్షేమ పథకాలతో జనహృదయ విజేతగా వైఎస్సార్ నిలిచిపోయారని కొనియాడారు.
- రాయచోటి బస్టాండు వద్ద ఉన్న వైఎస్సార్ విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ చిల్లీస్ ఫయాజ్ బాషా తదితరులు పూల మాలలు వేసి నివాళులర్పించారు. గడికోట మాట్లాడుతూ వైఎస్ఆర్ పాలన స్వర్ణయుగంలా సాగిందన్నారు. ఆయనకు భారతరత్న ఇవ్వాలని డిమాండ్ చేశారు.
- పీలేరు, తంబళ్లపల్లె నియోజకవర్గాల పరిధిలోని మండలాల్లో వైఎస్సార్ జయంతిని ఘనంగా నిర్వహించారు.
- రాజంపేటలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు పోలి రఘునాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో వైఎస్.రాజశేఖరరెడ్డి జయంతిని నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాస్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని తొలుత వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించి కేక్ కట్ చేశారు. అలాగే పలువురికి అల్పాహారం పంపిణీ చేశారు.

లిల్లీపూల సాగు.. ఆదాయం బాగు

లిల్లీ పూల సాగుతో రైతులు మంచి ఆదాయం గడిస్తున్నారు. నిలకడైన ధరతో లాభాలు తీసుకొస్తున్న పంట కావడంతో రైతులు ఈ పూల తోటల సాగుపై ఆసక్తి చూపిస్తున్నారు. ప్రస్తుతం మార్కెట్లో కిలో పూల ధర రూ.120 పలుకుతోంది. మొక్క నాటిన రెండేళ్లపాటు పూల దిగుబడులు రావడం వాటికున్న ప్రత్యేకత. జిల్లాలో పడమటి మండలాల రైతులు ఇప్పుడిప్పుడే లిల్లీ సాగుపై మక్కువ చూపుతున్నారు.

- మార్కెట్లో కిలో పూల ధర రూ.120
- రెండేళ్ల పాటు పూల దిగుబడులు
- పడమటి మండలాల్లో రైతుల ఆసక్తి


కొత్తపల్లెలో సాగు చేసిన లిల్లీ పూలు


మార్కెట్‌కు తరలించడానికి సిద్ధంగా ఉంచిన లిల్లీ పూలు

గుర్రంకొండ : జిల్లాలో పీలేరు, తంబళ్లపల్లె, మదనపల్లె నియోజక వర్గాల పరిధిలోని 1025 హెక్టార్లలో లిల్లీ పూలతోటలు సాగుచేస్తున్నారు. పొలాల దుక్కులు, మందులు, పూల మొక్కలు నాటడం, దిగుబడి వచ్చేంత వరకు ఎకరాకు లిల్లీ సాగుకు రూ.లక్ష నుంచి రూ.1.20 లక్షల వరకు పెట్టుబడి ఖర్చు వస్తుంది. పూల మొక్కలు నాటినప్పటి నుంచి నాలుగు నెలలకు వరకు దిగుబడి ఉంటుంది. పొలంలో ఒకసారి నాటితే రెండేళ్ల వరకు పూల దిగుబడి వస్తుంది. కోత మంచి అదును మీద ఉన్నప్పుడు ప్రతి రెండు రోజులకోసారి పూలు కోయాల్సి ఉంటుంది. మందులు, కూలీల ఖర్చు తక్కువగా ఉండడంతో లిల్లీ సాగుపై శ్రద్ధ చూపుతున్నారు. కలుపు గడ్డి తవ్వించి తొలగిస్తే పూల దిగుబడి ఎక్కువగా ఉంటుంది. అంతే కానీ విపరీతమైన రసాయన ఎరువులు, పురుగుల మందుల వాడకం ఉండదు.

మార్కెట్లో ప్రతి రోజూ డిమాండే

మిగతా పూలతో పోల్చితే లిల్లీ పూలకు మార్కెట్లో ప్రతి రోజూ డిమాండ్ ఉంటుంది. చామంతి పూలతో పాటు ఇతర పూల రకాలకు దసరా, దీపావళి, కేదారేశ్వర వ్రతాల్లో ఎక్కువ డిమాండ్. అయితే లిల్లీ పూలకు ప్రతి రోజూ డిమాండ్ ఉంటుంది. పూలదండల తయారీకి ఈ రకం చాలా ముఖ్యం. దీంతో లిల్లీ పూల ధర హెచ్చు తగ్గులు లేకుండా నిలకడగానే ఉంటుంది. ఈ తోటల సాగుతో రైతులకు రెండేళ్ల పాటు ఆదాయం సమకూరుతుంది. ఎకరాకు పెట్టుబడి ఖర్చు పోనూ రూ.3 లక్షల నుంచి రూ.4 లక్షల వరకు ఆదాయం వస్తుంది. ప్రస్తుతం మార్కెట్‌లో అత్యధికంగా రూ.120 ధర ఉండడం, ఏడాది పొడవునా సరాసరిన రూ.60 నుంచి రూ. 85 వరకు ధర ఉండడం రైతులకు మేలు చేస్తోంది. వాల్మీకీపురం, గుర్రంకొండ వ్యాపారులు పూలు కొనుగోలు చేసి విజయవాడ, తిరుపతి, గుంటూరుకు తరలిస్తుంటారు. కొందరు బెంగళూరు, కడప పట్టణాలకు ఎగుమతి చేస్తున్నారు. ఈ ఏడాది లిల్లీ ధర ఆశాజనకంగా ఉండడంతో రైతులు ఆదాయం గడిస్తున్నారు.

ఎకరంలో సాగు చేశాం



మాకున్న ఎకరం పొలంలో లిల్లీ పూలు సాగు చేశాం. దిగుబడి బాగానే వస్తోంది. మా ఇంట్లో ఇద్దరం కష్టపడతాం. పూలన్నీ మేమే కోసేస్తాం. కూలీల ఖర్చు తక్కువగా ఉంటుంది. మార్కెట్‌కు మేమే తీసుకెళతాం. పెట్టుబడి ఖర్చు తక్కువగా ఉండే పంట ఇదే. ప్రణాళికా బద్ధంగా సాగు చేస్తే దిగుబడులు వస్తాయి. మార్కెట్లో నిలకడగా ధరలు ఉంటాయి.

- ఎర్రమ్మ, గంగిరెడ్డిపల్లె

ధరలు బాగున్నాయ్



ప్రస్తుతం మార్కెట్లో లిల్లీ పూలకు మంచి ధర ఉంది. మార్కెట్లో కిలో రూ.120 పలుకుతోంది. నేను చాలా ఏళ్లుగా ఇదే పూల సాగు చేస్తున్నారు. మంచి లాభాలు వస్తున్నాయి. మార్కెట్లో ఇవే ధరలు నిలకడగా ఉంటే ఎకరానికి రూ. 3 లక్షలకు పైగా ఆదాయం వస్తుంది. సకాలంలో మందులు వాడితే రెండేళ్లపాటు దిగుబడులు సాధించవచ్చు.

-మల్లయ్య, కొత్తపల్లె

క్లుప్తంగా

ఎరువుల దుకాణాల తనిఖీ


ఎరువుల దుకాణం తనిఖీ చేస్తున్న అధికారులు

పీలేరు రూరల్ : మండలంలోని ఎరువుల దుకాణాలను సహాయ వ్యవసాయ సంచాలకులు లాల్‌రెడ్డి, తదితరులు సోమవారం ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రైతులకు ఎరువులు, విత్తనాలు అమ్మిన వెంటనే విధిగా బిల్లులు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో విజిలెన్స్ ఎస్ఐ రామకృష్ణనాయక్, జిల్లా వ్యవసాయ కార్యాలయం సాంకేతిక వ్యవసాయాధికారి బి.మోహన్, వాల్మీకిపురం, పీలేరు ఏవోలు నవీన్, రమాదేవి, ఏఈవో నజీర్ పాల్గొన్నారు.

గంజాయి స్వాధీనం


గంజాయి తరలిస్తున్న నిందితుల అరెస్టు చూపుతున్న సీఐ ఎన్.శేఖర్

మదనపల్లె : అక్రమంగా గంజాయి తరలిస్తున్న ఇద్దరు నిందితులను అరెస్టు చేసినట్లు తాలూకా సీఐ ఎన్.శేఖర్ తెలిపారు. విలేకరులతో సోమవారం ఆయన మాట్లాడుతూ... ముందస్తు సమాచారం మేరకు మదనపల్లె తట్టివారిపల్లె బైపాస్ రోడ్డులో తనిఖీలు నిర్వహిస్తుండగా, పోతబోలు పంచాయతీ కురవపల్లెకు చెందిన ఎం.గోవిందు(67), సీటీఎం పంచాయతీ మిట్టపల్లెకు చెందిన సి.చంద్రయ్య(65)లను అదుపులోకి తీసుకున్నామన్నారు. వారినుంచి రూ.15వేల విలువగల 750 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. నిందితులపై కేసు నమోదుచేసి రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు.

జాగ్రత్తలు తీసుకోవాలి


రైతులకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ బాలసుబ్రహ్మణ్యం

వాల్మీకిపురం : పశువుల పెంపకంలో పాడి రైతులు జాగ్రత్తలు తీసుకుంటే అధిక పాల దిగుబడి సాధ్యమని అన్నమయ్య జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ కార్యనిర్వాహణాధికారి డాక్టర్ బాలసుబ్రహ్మణ్యం అన్నారు. పశుగ్రాస వారోత్సవాలలో భాగంగా మండలంలోని అయ్యవారిపల్లిలో పాడి రైతులకు సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పశువులను పరీక్షించి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మదనపల్లి పశుసంవర్ధక శాఖ ఉపసంచాలకులు సత్యనారాయణ, వాల్మీకిపురం సహాయ సంచాలకులు నీరజ, పశువైద్యాధికారిణి చరిత, రైతులు పాల్గొన్నారు.

మదనపల్లె వాసి దర్శకత్వంలో ఆర్‌జీవీ సినిమా


రాంగోపాల్‌వర్మతో గురుప్రసాద్

మదనపల్లె సిటీ : ప్రముఖ సినీ దర్శకుడు, ఆర్‌జీవి ప్రొడక్షన్స్ వ్యవస్థాపకులు రాంగోపాల్ వర్మ త్వరలో నిర్మించనున్న సినిమాకు దర్శకత్వం వహించే అవకాశాన్ని అన్నమయ్య జిల్లా మదనపల్లె యువకుడు దక్కించుకున్నాడు. స్థానిక ఎస్టేట్ ప్రాంతానికి చెందిన గురుప్రసాద్ బీటెక్ చదివి హైదరాబాద్‌లోని ఓ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పని చేస్తూ షార్ట్ ఫిల్మ్ తీస్తున్నాడు. ఇటీవల రాంగోపాల్‌వర్మ నిర్మించనున్న సినిమాకు డైరెక్టర్ల ఎంపిక పోటీలు నిర్వహించారు. ఇందులో సుమారు 414 మంది పోటీలో నిలవగా చివరకు గురుప్రసాద్ ఎంపికయ్యారు. త్వరలో రాంగోపాల్‌వర్మ నిర్మించనున్న సినిమాకు డైరెక్టర్‌గా వ్యవహరించనున్నారు.

సిద్ధవటం రేంజ్‌లో కూంబింగ్

రేంజర్ బి.కళావతి


సిద్ధవటం రేంజ్‌లో కూంబింగ్ నిర్వహిస్తున్న అటవీ సిబ్బంది

సిద్ధవటం : సిద్ధవటం రేంజ్‌లో మూడు రోజులుగా కూంబింగ్ నిర్వహిస్తున్నామని రేంజర్ బి.కళావతి తెలిపారు. సిద్ధవటం అటవీ శాఖ కార్యాలయంలో సోమవారం ఆమె మాట్లాడుతూ కడప డీఎఫ్ఓ సందీప్‌రెడ్డి ఆదేశాల మేరకు సిద్ధవటం రేంజ్‌లో అటవీ అధికార సిబ్బంది నాలుగు బృందాలుగా ఏర్పడి గత మూడు రోజులుగా కూంబింగ్ నిర్వహిస్తున్నారన్నారు. ఒక్కొక్క బృందంలో 8 మంది చొప్పున, మొత్తం 40 మంది ఈ కూంబింగ్‌లో పాల్గొంటున్నారన్నారు. రాత్రి, పగలు పెట్రోలింగ్ విధులు నిర్వహించినా ఇప్పటివరకు ఎలాంటి స్మగ్లింగ్ ఆనవాళ్లు కనిపించలేదన్నారు. ఎర్రచందనం అక్రమ రవాణాకు పాల్పడుతున్న వారి వివరాలు తెలియజేస్తే తగిన పారితోషకం అందిస్తామన్నారు. వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని రేంజర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఆర్ఓ ఓబులేసు, కొండూరు అటవీ సెక్షన్ ఆఫీసర్ సురేష్‌బాబు, బీట్ అధికారులు రాజశేఖర్‌రెడ్డి, విశ్వనాథరెడ్డి, పెంచల్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

వందమందికి దివ్యాంగ నిర్ధారణ పరీక్షలు


సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా సహిత విద్య సమన్వయకర్త జనార్ధన్

పీలేరు : విభిన్న ప్రతిభావంతులకు ఉపకరణాలు పంపిణీ చేయడానికి సోమవారం దివ్యాంగ నిర్ధారణ పరీక్షలు చేసినట్లు జిల్లా సహిత విద్య సమన్వయకర్త జనార్ధన్ తెలిపారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పీలేరు, కలకడ, కేవీపల్లె, కలికిరి మండలాల విభిన్న ప్రతిభా వంతులకు వైద్య నిర్ధారణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దివ్యాంగులకు వినికిడి యంత్రాలు, ట్రై సైకిల్, సీపీ చైర్స్, రోలేటర్ పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. అలాగే దివ్యాంగ పిల్లలకు ప్రత్యేక బోధన, ఫిజియోథెరఫీ, వారికి ఎస్కార్ట్ ట్రాన్స్‌పోర్ట్, బాలికలకు తగు వేతనం, గృహాధారిత అలవెన్స్, డైరేషన్, రీడర్ అలవెన్స్ ఇవ్వనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంఈవోలు లోకేశ్వరరెడ్డి, పద్మావతమ్మ, హెచ్ఎంలు యర్రయ్య, సురేంద్రనాథరెడ్డి, ఈఎన్‌టీ డాక్టర్ ఈశ్వరసురేంద్ర, ఆర్థో డాక్టర్ సోమశేఖర్‌రెడ్డి, ఆడియో మెట్రీషియన్ మమతా, డాక్టర్ షహీన్‌తాజ్ తదితరులు పాల్గొన్నారు.

అధికారుల సమీక్షలో టీడీపీ నేత

మండల అధికారుల తీరుపై విమర్శలు


సుగవాసి ఆధ్వర్యంలో పురోగతి వివరిస్తున్న మండల అధికారి

ఒంటిమిట్ట(రాజంపేట) : రాజంపేట నియోజకవర్గంలో ప్రోటోకాల్ అభాసుపాలైంది. ప్రజలచే ఎన్నుకోబడిన ప్రజాప్రతినిధుల ప్రోటోకాల్‌ను నియోజకవర్గంలోని అధికారులు పాటించడం లేదు. ఏ హోదా లేని..ప్రజల ఓట్లతో గెలవకపోయినా టీడీపీ నేత అడుగులకు మడుగులు వత్తుతున్నారనే విమర్శలున్నాయి. సార్వత్రిక ఎన్నికల్లో ఓటమి పాలైన టీడీపీ అభ్యర్థి సుగవాసి బాలసుబ్రహ్మణ్యంను ఇప్పుడు అధికారులు జీ హుజూర్ అంటున్నారు. నేరుగా వివిధ శాఖల అధికారులతో ఆయన దర్జాగా సమీక్షిస్తున్నారు. సోమవారం ఒంటిమిట్ట మండల పరిషత్ కార్యాలయంలో రాజంపేట డీఆర్డీఏ అధికారులతో జరిగిన సమావేశంలో సుగవాసి అధికారులపై పెత్తనం వహించారు. వారిచేత సన్మానాలు, సత్కారాలు చేయించుకున్నారు. మండల స్థాయి అధికారులు ఇదే అదునుగా అత్యుత్సాహం కనబరిచారు. అంతేగాక... టీడీపీ ఇన్‌ఛార్జి హోదాలో లెటర్ హెడ్ తయారుచేయించి మరీ అధికారులకు ఆదేశాలు జారి చేస్తున్నారనే విమర్శలున్నాయి. టీడీపీ అధిష్టానం ఇప్పటి వరకూ ఇన్‌ఛార్జిగా ఎవరినీ ప్రకటించలేదు. అయినా ఆ హోదాలో సమావేశాలు నిర్వహించడంపై ప్రజాప్రతినిధులు పెదవి విరుస్తున్నారు. పైగా ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ రామచంద్ర, ఇన్‌ఛార్జి ఎమ్మార్వో అయూబ్‌ఖాన్, ఈవోపీఆర్డీ కుమారరంగయ్య పాల్గొన్నారు.

పల్లకీలో ఊరేగిన భద్రకాళీ సమేతుడు


పల్లకిలో ఊరేగుతున్న భద్రకాళీ సమేతుడు

రాయచోటి టౌన్ : రాయచోటి భద్రకాళీ సమేత వీరభద్రస్వామిని సోమవారం పల్లకిపై ఊరేగించారు. ముందుగా వీరభద్రస్వామి, భద్రకాళీ అమ్మవారి మూల విరాట్‌లకు అభిషేకం చేసి పూజలు జరిపారు. అనంతరం రంగు రంగుల పూలు, పట్టు వస్త్రాలు, బంగారు ఆభరణాలతో అలంకరించారు. అనంతరం పల్లకిపై ఉంచి ఆలయ మాఢ వీధులలో ఊరేగించారు. ఈవో డివి రమణారెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

రాయచోటిలో సినిమా షూటింగ్


సినీ నటులపై క్లాప్ కొడుతున్న వినయ్ కుమార్

రాయచోటి టౌన్ : రాయచోటి పట్టణంలోని చెక్ పోస్టు వద్ద ఉన్న శివాలయంలో 'వాసి వాడి తస్సదియ్యా' సినిమా షూటింగ్‌ను డాక్టర్ అబ్దుల్ కలాం ట్రస్టు డైరెక్టర్ వినయ్ కుమార్ క్లాప్ కొట్టి ప్రారంభించారు. అనంతరం సినిమా డైరెక్టర్ కొర్లకొంట కల్యాణ్ మాట్లాడుతూ 2000 సంవత్సరానికి ముందు గ్రామీణ ప్రాంత కుటుంబ నేపథ్యంగా సాగే సినిమా ఇది అన్నారు. కుటుంబం విలువలు, బంధాలు, బంధుత్వాలు మేళవించి అక్కా తమ్ముడి మధ్య సాగే చిత్రమే ఈ చిత్ర ప్రధాన కథనం అన్నారు. మొదటి రోజు శివాలంలో పూజలు చేసి అనంతరం అన్నమయ్య జిల్లాలోని పలు అందమైన గ్రామీణ ప్రాంతాలలో సినిమా నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రవీణ్‌కుమార్, ఆలీ, నాగలక్ష్మి, ధనుష్, భానుప్రకాష్, తహీర్, అమీర్, మారుతి పాల్గొన్నారు.

ఆర్డీవో కార్యాలయం దిగ్బంధం


ఆర్డీవో మోహనరావుకు వినతిపత్రం అందజేస్తున్న నేతలు, మహిళలు

రాజంపేట : భూములను పేదలకు పంచిపెట్టాలని సీపీఐ నాయకుడు దార్ల రాజశేఖర్, వ్యకాస నాయకులు మొగలి వినయ్, బీకేఎంయూ జిల్లా అధ్యక్షుడు పండుగోల మణి డిమాండ్ చేశారు. 400 మంది మహిళలతో కలిసి ర్యాలీగా వచ్చి రాజంపేట ఆర్డీవో కార్యాలయాన్ని దిగ్బంధించారు. వారు మాట్లాడుతూ జులై ఆఖరులోగా ఏబీసీ కంపెనీ యాజమాన్యం ఆక్రమించిన భూములను స్వాధీనం చేసుకుని పేదలకు పంచాలన్నారు. కోడూరు మండలం నారాయణరాజుపోడులో నివసిస్తున్న అరుంధతీవాడ, గిరిజనవాసులు సెంటు భూమిలేక దుర్భర జీవితం గడుపుతున్నారన్నారు. గ్రామం ప్రక్కనే 250 ఎకరాల బంజరు భూములను ఏబీసీ కంపెనీ ఆక్రమించి పేదల కడుపుకొడుతుంటూ రెవెన్యూ యంత్రాంగం చూసీ చూడనట్లుగా ఉండడ సిగ్గుచేటన్నారు. కేబుడగుంటపల్లె పంచాయతీ కన్నిగుంట ఎస్టీ కాలనీ పరిధిలో 70 ఎకరాల భూములను పేదలకు పంచిపెట్టకపోతే ఈ నెల 15న ఆందోళన చేపడతామన్నారు. ఆగస్టు మొదటి వారంలో ప్రతి కుటుంబానికి రెండు ఎకరాలు తామే పంచుతామని ఆర్డీవోమోహనరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో నేతలు హాజ్మాజి, కోడూరు రవి, నరసింహులు, సామా గంగయ్య, నరసయ్య, సోనీ, బుజ్జమ్మ, షేక్ షాహీనా, దళితులు, గిరిజనులు, ముస్లీం మైనార్టీ మహిళలు పాల్గొన్నారు.

భర్త చేతిలో భార్య హతం

చింతకొమ్మదిన్నె : మండలంలోని పాపాసాహెబ్‌పేటలో నివాసముంటున్న లక్ష్మీదేవిని ఆమె భర్త వెంకటసుబ్బారెడ్డి రోకలిబండతో బాది హత్య చేశాడు. సీకే దిన్నె ఎస్ఐ శ్రీనివాసులురెడ్డి కథనం మేరకు.. వెంకటసుబ్బారెడ్డికి తన భార్య లక్ష్మీదేవితో తరచూ గొడవ పడేవాడు. సోమవారం యథాప్రకారం ఇద్దరూ కుటుంబ కలహాలతో గొడవపడగా.. సుబ్బారెడ్డి ఆగ్రహంతో ఊగిపోయారు. అక్కడే ఉన్న రోకలిబండతో భార్య తలపై బాదాడు. తీవ్ర గాయాలైన లక్ష్మీదేవిని బంధువులు చికిత్స నిమిత్తం రిమ్స్‌కు తరలించగా చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందినట్లు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఏఎస్ఐ, హెడ్ కానిస్టేబుల్ సస్పెన్షన్

కడప అర్బన్ : కడప టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఏఎస్ఐగా పనిచేస్తున్న పి.భాస్కర్ (ఏఎస్ఐ–246), అతడి సోదరుడు ఏఆర్ హెడ్‌కానిస్టేబుల్ పి.విజయకుమార్(ఏఆర్ హెచ్‌సి 1801)లను సస్పెన్షన్ చేస్తూ కర్నూలు డీఐజీ సీహెచ్.విజయరావు ఉత్తర్వులు జారీ చేశారు. ఇరువురూ కడప వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన దాడి సంఘటనలో నిందితులుగా ఉన్న వీరు పరారీలో ఉన్నారు. రెండు రోజుల కిందట కోర్టులో లొంగిపోయారు. మెజిస్ట్రేట్ ఆదేశాల మేరకు ఇరువురినీ రిమాండ్‌కు పంపారు. వీరి వ్యవహారంపై నిఘా విభాగం వారు జిల్లా ఎస్పీ సిద్దార్థ్ కౌశల్‌కు నివేదిక ఇవ్వడంతో శాఖా పరమైన సస్పెన్షన్‌కు సిఫారసు చేస్తూ, కర్నూలు– కడప రేంజ్ డీఐజీ సిహెచ్.విజయరావుకు ప్రతిపాదనలు పంపించారు. ఆ మేరకు వీరిని పోలీసు ఉన్నతాధికారులు సస్పెన్షన్ చేశారు. వారిలో విజయకుమార్ గత నెలలో తమకు నిర్దేశించిన విధుల్లో నిర్లక్ష్యం వ్యవహరించడంతోపాటు అధికారిపై దుర్భాషలాడటంతో ఈ చర్యలకు సిఫారసు చేశారు.

వరకట్న వేధింపులపై కేసు నమోదు

మదనపల్లె : వరకట్న వేధింపులపై కేసు నమోదు చేసినట్లు టూటౌన్ సీఐ యువరాజు తెలిపారు. పట్టణంలోని నర్సింగ్‌హోం వీధికి చెందిన వహీదా కుమార్తె షేక్ ఆకీలా(26)ను రొంపిచెర్లకు చెందిన సలీంబాషా, జరీనాల దంపతుల కుమారుడు షేక్ అమీర్‌బాషాకు ఇచ్చి 2022లో వివాహం జరిపించారు. పెళ్లైన మూడు నెలల నుంచి అత్తింటివారు అదనపు కట్నం కోసం ఆకీలాను వేధించడం మొదలుపెట్టారు. దీంతో ఆమె పుట్టినిల్లు మదనపల్లెకు చేరుకుంది. పెద్దమనుషుల సమక్షంలో పంచాయతీ నిర్వహించినా ఫలితం లేకపోగా..ఇటీవల వేధింపులు ఎక్కువయ్యాయి. దీంతో బాధితురాలు ఆకీలా సోమవారం టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు భర్త అమీర్ బాషా, అత్త జరీనా, మామ సలీంబాషాలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఎర్రచందనం కేసులో జైలుశిక్ష


ప్రసాద్ (ఫైల్)

పీలేరు : ఎర్రచందనం కేసులో ఓ ముద్దాయికి జైలు శిక్ష పడినట్లు పీలేరు అటవీ క్షేత్రాధికారి బి.రామ్లా నాయక్ తెలిపారు. స్థానిక విలేకరులతో సోమవారం ఆయన మాట్లాడుతూ కేవీపల్లె మండలం పాళెంగడ్డకు చెందిన ఎం.ప్రసాద్ 2013 జులై, 21న బొంతకనుమ సమీపంలో అక్రమంగా 85 కిలోల బరువు గల నాలుగు ఎర్రచందనం దుంగలు తీసుకెళ్తుండగా అరెస్టు చేసినట్లు తెలిపారు. తిరుపతి కోర్టులో ప్రసాద్‌పై నేరం రుజువు కావడంతో మూడు నెలలు జైలుశిక్ష, రూ.10 వేల జరిమానా విధించినట్లు తెలిపారు.